క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీను

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడి కుటుంబం బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేసింది. భీమవరానికి చెందిన కరిచర్ల లక్ష్మీదుర్గ పవన్‌కుమార్, సందీప్ కుమార్ ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ సీనియర్ అసిస్టెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

పోషణ మాసోత్సవాలు



పోషకాహార మహోత్సవాలలో అంగన్‌వాడీల ప్రదర్శన

కొయ్యలగూడెం: బోడిగూడెం గ్రామంలో బుధవారం పోషణ మాసోత్సవం కార్యక్రమం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీడీపీఓ స్వర్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ కడకట్ల గడ్డియ్య హాజరయ్యారు. అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించి గర్భిణులకు సీమంత కార్యక్రమాలు చేపట్టారు. ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, ఎంపీటీసీ డేవిడ్ కింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నయోమి రాణి, కిషోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు అంగవాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న వైద్యుడు రామచంద్రరావు

జంగారెడ్డిగూడెం: ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు బుధవారం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు కాకర్ల రామచంద్రరావు ల్యాప్‌టాప్ అందజేశారు. తన తండ్రి పెద వెంకట రామకృష్ణ జ్ఞాపకార్థం తల్లి కాకర్ల సుశీలవతి చేతుల మీదుగా ల్యాప్‌టాప్, బయోమెట్రిక్ డివైస్‌ను అసోసియేషన్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి కొమ్ముకూరి నాగేశ్వరరావు, కోశాధికారి కూచిత్రినాధరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని అందుకున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం విద్యాసామగ్రిని అందజేశారు. స్థానిక పాతబస్టాండ్ ఎంబీ సోషల్ క్లబ్ వెనుక ఉన్న ఊర్దూ పాఠశాలలో ఫౌండేషన్ చైర్మన్ యర్రా అప్పారావు విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ పీరా సాహెబ్, యర్రంశెట్టి శివరామకృష్ణ, చాటపర్తి పోసిబాబు, పెనుమర్తి సురేష్, బేతా రమేష్, హెచ్ఎం షేక్ షకీలా, గుజ్జేటి మల్లేశ్వరరావు, డాక్టర్ ఆర్‌ఎంపీ జాన్ తదితరులు పాల్గొన్నారు.

'పాలవెల్లువ' రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

లింగపాలెం: జగనన్న పాలవెల్లువ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ధర్మాజీగూడెం ఏడీఏ టి.రామకృష్ణప్రసాదరావు కోరారు. బుధవారం జేపీవీ, కోఆపరేటివ్ శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో కొణిజర్లలో పాడి రైతులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కేంద్రాలలో పాలు పోసే పాడి రైతులకు ప్రభుత్వం రుణసదుపాయం కల్పిస్తుందన్నారు. సొసైటీల ద్వారా తొలివిడతగా రూ.30 వేలు, రెండో విడతగా రూ.లక్ష చొప్పున ఒక్కో లబ్ధిదారునికి రుణం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లింగపాలెం పశుసంవర్ధకశాఖ వైద్యుడు ఎల్.రామకృష్ణ, ధర్మాజీగూడెం సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు, వెలుగు ఏపీ ఎం.కమలాదేవి, వెలుగు సీసీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

బుట్టాయగూడెం: నూతిరామన్నపాలెం సచివాలయ పరిధిలో సుమారు రూ.26 లక్షల వ్యయంతో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే బాలరాజు ఆదేశాల మేరకు పనులను పరిశీలించినట్లు ఆయన చెప్పారు. పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌లను ఆదేశించామన్నారు.

పునరావాస గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- పైడాకులమామిడిలో గడపగడపకు మన ప్రభుత్వం



మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: పునరావాస గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చెప్పారు. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో పోలవరం ముంపు నిర్వాసితుల కోసం నిర్మించిన తూటిగుంట, పైడాకులమామిడి, పల్లపూరు, ములకలగూడెం నిర్వాసిత గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నిర్వాసితులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తూటిగుంట, తల్లవరం గ్రామంలో మంచినీటి సమస్య ఉందని వాటి పరిష్కారానికి కృషి చేయా లని ఆ గ్రామాల్లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి మంచినీటి ఇబ్బంది కలుగకుండా చూడాలని అన్నారు. అలాగే పైడాకులమామిడి పాఠశాలను సందర్శించిన సమయంలో అక్కడ మరుగుదొడ్లు లేవని ఉపాధ్యాయులు తెలుపగా వెంటనే ఆ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బాలరాజు అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని, పథకాల అమలులో నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, వారి విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని ఆయన కోరారు. పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, బుట్టాయగూడెం జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం జయమ్మ, ఎంపీటీసీలు అల్లూరి రామ్మోహన్‌రావు, ఉయికే రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, భౌమరాజు సత్యనారాయణ రాజు, యాండ్ర రవి, జీలుగుమిల్లి మండల నాయకులు చందా ప్రసాద్, బోదా శ్రీనివాసరెడ్డి, బూరుగు ప్రేమ్‌కుమార్, బుట్టాయగూడెం మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయని ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెంకు చెందిన నక్కా సత్యనారాయణకు లారీ మెకానిక్ షాపు, కిరాణా షాపు ఉన్నాయి. సామాగ్రిని కొనుగోలు నిమిత్తం సత్యనారాయణ మోటార్‌సైకిల్‌పై వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా బైపాస్ వద్ద ఎదురుగా లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను స్థానిక ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం



సీసీ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం అని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. మండలంలోని కామవరపుకోట బంగ్లా దగ్గర నుంచి వై.కాలనీ వరకు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా, రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎంపీపీ, జెడ్పీటీసీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం చేపడుతున్న, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, కామవరపుకోట సర్పంచ్ కర్రిపోతు అనూష, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, వైస్ ఎంపీపీ గిరిజ, ఎంపీటీసీలు పోలిమెట్ల ప్రశాంత్, కరిముల్లా, మేడంకి పద్మావతి, బొల్లు వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

నారాయణరావు సేవలు ఎనలేనివి



నారాయణరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: దివంగత కోటగిరి నారాయణరావు ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన కోటగిరి నారాయణరావు 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం రావికంపాడులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆశ్రమం ఆసుపత్రి వారిచే మెడికల్ క్యాంపు నిర్వహించి, గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. కార్యక్రమంలో చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, ఎంపీటీసీ అంజిరెడ్డి, మిడత రమేష్ బాబు, కోటగిరి శ్రీకాంత్, మేడూరి రంగబాబు, కృష్ణ, గణేష్, మోర్ల సత్యనారాయణ, వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి



చింతలపూడిలో నిరసన తెలుపుతున్న దృశ్యం

చింతలపూడి: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త, ఎమ్మార్పీస్ జాతీయ నాయకురాలు చవటపల్లి విజయ మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ఆదేశాలపై రోడ్డుపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని విజయమాదిగ అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎంఎస్‌పీ కన్వీనర్ కె.హైమావతి, సొంగా నక్షత్రం మాదిగ, గొల్లపల్లి సౌజన్యమాదిగ, సుగుణకుమారి మాదిగ, నాగమణి మాదిగ, కె.కోట ఎమ్మార్పీఎస్ కన్వీనర్ పి. వీరాంజనేయులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు బిరుదుగడ్ల నాగేశ్వరరావుని సన్మానిస్తున్న దృశ్యం

కామవరపుకోట: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు బిరుదుగడ్ల నాగేశ్వరరావు దంపతులను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భీమరాజు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి నాగేశ్వరరావు మాస్టారు ఎంతో కృషి చేశారని, ఆయన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకోవటం గర్వకారణం అని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, ఎంపీటీసీ కనుమూరి అంజిరెడ్డి, షేక్ మీరా సాహెబ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సింహాచలం, యూటీఎఫ్ నాయకులు లక్ష్మినారాయణ, భూషణం, బీటీఏ నాయకులు రఘునాథ్, రాంబాబు, బొర్రంపాలెం పాఠశాల హెచ్‌ఎం గంగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.విజయ ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



రెడ్డిగణపవరంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని రెడ్డిగణపవరంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను బుధవారం బాలరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం, రూ.21 లక్ష 80 వేలతో రైతు భరోసా కేంద్రం, రూ.17 లక్షల 50 వేలతో హెల్త్ క్లినిక్ నిర్మాణం చేసి ప్రారంభించడం ద్వారా ప్రజలకు ఆయా భవనాల్లో మెరుగైన సేవలు అందనున్నాయని అన్నారు. దేశంలోనే మొదటిసారిగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సేవలు అందించడమే కాకుండా ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రజలకు ఇంటికే సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమయ్యే సేవలను అందించేలా కృషి చేస్తున్నామని, ముఖ్యంగా ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రంలోనే పొందవచ్చని అన్నారు. అదేవిధంగా విలేజ్ క్లినిక్‌ల ద్వారా అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం జయమ్మ, ఎంపీటీసీలు అల్లూరి రామ్మోహన్‌రావు, ఉయికే రత్నకుమారి, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, భౌమరాజు సత్యనారాయణ రాజు, యాండ్ర రవి, జీలుగుమిల్లి మండల నాయకులు చందా ప్రసాద్, బోదా శ్రీనివాసరెడ్డి, బూరుగు ప్రేమ్‌కుమార్, బుట్టాయగూడెం మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు అమరవరంలో ఉన్నత పాఠశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు

కుక్కునూరు: మండలంలోని రాజీవ్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమరవరం పూర్వ పాఠశా ల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉత్సవాల నిర్వహణ కమిటీ బుధ వారం ఒక ప్రకటనలో తెలిపింది. 1948లో ఏర్పడిన ఈ పాఠశాలలో విద్యనభ్యసించి ఇతర దేశాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో పలు రంగాల్లో సామాజిక సేవలందిస్తున్న పూర్వ విద్యార్థులను ఈ కార్యక్రమంలో సత్కరించేందుకు కమిటీ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్లాటినం జూబ్లీ ఉత్సవాల అనంతరం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించనున్నారు. పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ పిలుపునిచ్చింది.

ఘనంగా గణేష్ ప్రతిమల నిమజ్జనం



కన్నాపురంలో ప్రసాదాన్ని వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని రాళ్లకుంట, సూర్యచంద్రరావుపేట గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు బుధవారం అట్టహాసంగా జరిగాయి. మందిరాల వద్ద ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణనాథుల విగ్రహాలను ఉంచి, విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత చిత్రవిచిత్ర వేషధారణలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, బాణసంచా సందళ్ల నడుమ వినాయక విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. రాత్రి కొలనుల్లో నిమజ్జనం చేశారు.

లింగపాలెం : పలు గ్రామాల్లో గణనాథుని విగ్రహాలకు బుధవారం ఊరేగింపు నిర్వహించారు. ట్రాక్టర్‌పై సుందరంగా ఆలంకరించి మేళతాళాలు, బాణసంచా నడుమ గణేష్ ప్రతిమలను ఊరేగించారు. ధర్మాజీగూడెం, రంగాపురం, లింగపాలెం, బాదరాల తదితర గ్రామాల్లో ఊరేగింపులు ఆకట్టుకున్నాయి. అనంతరం వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

టి.నరసాపురం: చవితి ఉత్సవాల సందర్భంగా టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో గణనాథుడి విగ్రహం వద్ద బుధవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల యూత్ నాయకుడు సీతారామ్ ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ యూత్ మండలాధ్యక్షుడు కన్నం సర్వేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ కొనకళ్ల మోహన్‌కుమార్, వంటిపల్లి సురేష్, ఎం.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం వేలం

కొయ్యలగూడెం: కన్నాపురం మెయిన్ సెంటర్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి సమర్పించిన లడ్డూకు బుధవారం వేలం నిర్వహించారు. నల్లజర్ల అనిల్ 36 కేజీల లడ్డూను స్వామివారికి నివేదన నిమిత్తం సమర్పించగా, వేలంలో శ్రీకృష్ణ యూత్ రూ.20,300కు దక్కించుకున్నారు.

టీషర్ట్‌ల పంపిణీ

బుట్టాయగూడెం: వినాయక చవితి సందర్భంగా దాసియ్యపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోదెం సుధాకర్ యువకులకు టీషర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఊరేగింపు, నిమజ్జనం సమయంలో యువకులు ఒకే యూనిఫామ్‌లో ఉండాలనే ఉద్దేశంతో ఈ టీషర్ట్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యువకులు తెల్లం రమేష్, బోడయ్య, వీర ప్రతాప్, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: వినాయక చవితి సందర్భంగా పలు ప్రత్యేక పందిళ్లలో పూజలందుకున్న విఘ్నేశ్వరుని ప్రతిమలను బుధవారం పలు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం గణేశుని గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలో నిమజ్జనం చేశారు. దుద్దుకూరులో జరిగిన విఘ్నేశ్వరుని ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీఓ సంజీవరావు

చింతలపూడి: జీవితంలో ఏదైనా సాధించాలంటే ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని ఏలూరు జిల్లా డీసీఓ సంజీవరావు అన్నారు. స్థానిక అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవా రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదని అన్నారు. జీవితంలో ఉన్నత స్థితికి చేరాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

కుక్కునూరు: కుక్కునూరు మండలంలో డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయని, వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో కుక్కునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి వైద్య అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ మండలంలోని కివ్వాక గ్రామంలో నెలరోజుల వ్యవధిలో జ్వరానికి ముగ్గురు మృతి చెందారని అన్నారు. ప్రధాన రహదారిపై ఉన్న కివ్వాక గ్రామంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గిరిజన గ్రామాల్లో పరిస్థితిని అధికారులు అంచనా వేసి వెంటనే వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, వరకా శ్యామల, కె.సోనా, మడకం కామేశ్, సోయం కామేశ్, సోయం వెంకీ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వరకట్న వేధింపులపై మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం మైసన్నగూడెంకు చెందిన ఆకు సాయికుమార్‌కు, మౌనికకు 2019లో వివాహం కాగా వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. తనను పుట్టింటికి వెళ్లనీయకపోవడంతో పాటు, అదనపు కట్నం కోసం భర్త, అతని కుటుంబసభ్యులు మరో నలుగురు కలిసి వేధిస్తున్నారని బాధితురాలు మౌనిక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.